# ప్రజల మాట ప్రగతి బాట

# తుంగతుర్తి నియోజకవర్గం

## దోభీ ఘాట్ నిర్మాణ పనుల పరిశీలన


మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో దోభీ ఘాట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ డీఈఈ మనోహర

మోత్కూరు, నవంబర్ 8 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వం రూ.2 కోట్లతో చేపట్టిన దోభీ ఘాట్ నిర్మాణ పనులను బుధవారం పబ్లిక్ హెల్త్ డీఈఈ మనోహర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు నెలల్లో దోభీ ఘాట్ పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రూ.45 లక్షలతో దోభీ ఘాట్‌లో మెషిన్లు, రూ.1.55 కోట్లతో భవన నిర్మాణం తదితర పనులను చేయనున్నట్లు వెల్లడించారు. పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట పబ్లిక్ హెల్త్ ఏఈ సురేశ్‌కుమార్, కాంట్రాక్టర్ సుగుణాకర్‌రెడ్డి ఉన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై కళాజాత



మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక సారథి బృందం

మోత్కూరు, నవంబర్ 8 : ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ తెలంగాణ సాంస్కృతిక సారథి, ఆలేరు కళాబృందం బుధవారం అవగాహన కల్పించింది. బుధవారం మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని పలు కూడళ్లలో పాటల ద్వారా కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు.

## నేడు అర్వపల్లికి ఎమ్మెల్యే కిశోర్ రాక

అర్వపల్లి, నవంబర్ 8 : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం అర్వపల్లికి రానున్నట్లు జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు అనంతరం తుంగతుర్తి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నటుల వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అన్నం పెట్టే బీఆర్‌ఎస్సా.. సున్నం పెట్టే కాంగ్రెస్సా

- ఏది కావాలో ప్రజలు ఆలోచించాలి
- పని చేసేవాళ్లను ఆదరించాలి
- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- నూతనకల్ మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం


బక్కహేమ్లాతండాలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నూతనకల్, నవంబర్ 8 : తెలంగాణ ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకునే సీఎం కేసీఆర్ కావాలో.. అబద్ధపు హామీలతో సున్నం పెట్టే కాంగ్రెస్, బీజేపీలు కావాలో ప్రజలు ఆలోచించాలని బీఆర్‌ఎస్ తుంగతుర్తి నియోజక వర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బక్కహేమ్లాతండా, సోమ్లాతండా, టీక్యాతండా, తాళ్లసింగారం, యడవెల్లి, చిల్పకుంట్ల, వెంకేపల్లి, ఎర్రపహడ్ గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేసేవాళ్లను ప్రజలు ఆదరించాలని కోరారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే 24 గంటల కరెంట్ ఇవ్వరని, రైతు బంధు బంద్ చేస్తారన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం కేసీఆర్‌ను మరిచిపోవద్దని సూచించారు. తుంగతుర్తి నియోజక వర్గాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ప్రస్తుతం రైతులకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తుండగా దాన్ని రూ.16 వేలుకు పెంచుతున్నట్లు, కల్యాణ లక్ష్మి పథకం కింద రూ.2 లక్షల ఇస్తామని, గ్యాస్ సిలిండర్ రూ.400కే అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే సౌభాగ్యలక్ష్మి పథకం కింద ప్రతి పేద మహిళకు రూ.3 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ చెల్లిస్తామని తెలిపారు. పేదలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పథకం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కారు గుర్తుకు ఓటేసి మూడోసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. అంతకుముందు కిశోర్‌కుమార్ ప్రచార రథంలో గ్రామాలకు రాగా బీఆర్‌ఎస్ శ్రేణులు బ్యాండ్ మేళాలు, బైక్ ర్యాలీలతో ఘన స్వాగతం పలికాయి. మహిళలు మంగళ హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతీసంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చూడి లింగారెడ్డి, సర్పంచులు గుగులోతు శంకర్ నాయక్, లావుడ్య నర్సింహానాయక్, కొంపెల్లి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, గోరుగంటి మోహన్‌రావు, బిక్కి బుచ్చయ్య, మట్టిపెల్లి గంగయ్య, తాడూరి లింగయ్య, బద్ధం ప్రశాంత్‌రెడ్డి, బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్, పులుసు లింగమల్లయ్య, గాద్దుల లింగరాజు పాల్గొన్నారు.


తాళ్లసింగారంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు

# ఎమ్మెల్యే కిశోర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్


తుంగతుర్తి : కొత్తగూడెంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్

తుంగతుర్తి, నవంబర్ 8 : తుంగతుర్తి నియోజక వర్గంలో రూ.3 వేల కోట్ల పై చిలుకు అభివృద్ధి పనులు చేసిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తామని వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తగూడెం, వెలుగుపల్లి, వెంపటి, కాశితండా, గొట్టిపర్తి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, గోపగాని శ్రీనివాస్, తడకమళ్ల రమేశ్, వంశీగౌడ్, గునగంటి సంతోశ్, తునికి సాయిలు, తునికి లక్ష్మి, చంటి, రమేశ్ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ గెలుపుతోనే మరింత అభివృద్ధి

మోత్కూరు : తుంగతుర్తి నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ గెలుపుతోనే మరింత అభివృద్ధి జరుగనున్నదని బీఆర్‌ఎస్ మోత్కూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 4, 7, 8 బూత్‌ల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ శాఖలు, బూత్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నియోజక వర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కూరెళ్ల కుమారస్వామి, గనగాని నర్సింహ, బీఆర్‌ఎస్ నాయకులు దండ్ల కళ్యాణ్, కూరెళ్ల సైదులు, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.


మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కళ్యాణ్ చక్రవర్తి

### వర్ధమానుకోటలో ఇంటింటి ప్రచారం

నాగారం : ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్‌కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట ఈదుల అరుణ్‌కుమార్, దర్శనం శేఖర్, మేడి మల్లేశ్, అనీల్, వినయ్, కిరణ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


మద్దిరాల : మండల కేంద్రంతో పాటు పోలుమల్ల, గోరెంట్ల, కుంటపల్లి, మామిండ్లమడవ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

### కోటమర్తిలో..

అడ్డగూడూరు : మండలంలోని కోటమర్తి, కంచనపల్లి, డి.రేపాక, లక్ష్మీదేవికాల్వ, ధర్మారం, గట్టుసింగారం, మానాయికుంట తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిత్తలూరి నరేశ్, గ్రంథాలయ చైర్మన్ పాశం విష్ణువర్ధన్, మండల లతీఫ్, షేక్ జహంగీర్, వెంకట్‌రెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.


నాగారం : వర్ధమానుకోటలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్


మద్దిరాల : పోలుమల్ల గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు


అడ్డగూడూరు : కోటమర్తిలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు